క్లుప్తంగా

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ లయన్ మెల్విన్ జోన్స్ జయంతి సోమవారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఖాండ్రె విశాల్, కోశాధికారి గుండా శ్యాం, జోనల్ చైర్మన్ నాంపల్లి శంకర్, డైరెక్టర్లు వెంకటరమణారెడ్డి, రావుల వినాయక్‌రావు, కోట వెంకన్న, శంకర్, సభ్యులు అబ్దుల్ హకీం, భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కావుడే సుమలత రమేశ్‌తో పాటు చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన కావుడే బక్కన్నల ఇండ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, నికూరి రమేశ్, మెస్రం రాజారాం, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



కిట్ అందజేస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన క్రీడాకారులకు సోమవారం ఎస్సై కొమురయ్య వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి అవకాశాలు అందుకోవాలన్నారు. యువత చెడుమార్గంలో వెళ్లకుండా క్రీడలు ఉపయోగ పడతాయని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు భవనం మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

రెబ్బెన: మండల కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్‌క్లబ్ కోసం భవనాన్ని మంజూరు చేయాలని మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి గోలేటిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ కోసం భవనం లేకపోవడంతో సమావేశాలు, ప్రెస్‌మీట్‌ల నిర్వహణకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు సంపత్‌కుమార్, జర్నలిస్టులు రామస్వామి, శ్రీనివాస్, రమేశ్, రవీందర్, సాయిసుప్రజ్, సాయి బాబాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రయ శ్రామణేర్ సైనిక్ శిక్షణ శిబిరం పోస్టర్లను సోమవారం కౌటాల బుద్ధవిహార్‌లో మహార్ సంఘం నాయకులు విడుదల చేశారు. ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. శిబిరంలో భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించడంతో పాటు క్రమశిక్షణ, సహనంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాలోని మహార్ కులస్తులు, బౌద్ధ అభిమానులు శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, సంఘం మండలాధ్యక్షులు బండురావు, వెంకటేశ్, గోవింద్‌రావు, ఏమాజీ, పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

- గుంతలమయంగా పంగిడిమాదర – లింగాపూర్ రోడ్డు
- జోరుగా ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు
- అధిక లోడ్‌తో వెళ్తున్నా పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన పంగిడిమాదర నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డు

తిర్యాణి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధిక లోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40శాతానికి పైగా ఉండగా అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు సైతం అక్రమార్కుల అధిక లోడు అక్రమ రవాణాతో పూర్తిగా చెడిపోతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణాపై అధికారులు పట్టించుకోకుండా మాములుగా తీసుకుంటున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

అత్యవసర సమయంలో ఇబ్బందులు..

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉండటంతో అక్కడి వారు ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామంలోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి ఇసుకను తరలిస్తున్నారు. దీంతోపాటు మండలంలోని కౌటగాం పంచాయతీ పరిధిలోని వాగు నుంచి సైతం అనుమతులు లేకుండానే రవాణా చేస్తున్నారు. అసలు రోడ్డు తారు లేచి ఉండటం దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కాగా కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతి లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంగిడిమాదర గ్రామం నుంచి దాంపూర్, కౌటగాం, లింగాపూర్, సిర్పూర్(యూ) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలైన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్ వాహనం కూడా నడిపే పరిస్థితి లేకపోవడంతో ఆదివాసీలకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు. అయినా అంతంత మాత్రంగా ఉన్న రోడ్డుపై ఇసుకతో కూడిన ట్రాక్టర్ల రాకపోకలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

కొత్త రోడ్డు నిర్మించాలి



ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి తరలించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్‌కు వెళ్లాలన్నా కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. రోడ్డు నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి.

– గెడం సుభాశ్, తుడుందెబ్బ జిల్లా నాయకుడు

మురుగునీటిని తొలగించరూ..!



ఆసిఫాబాద్అర్బన్: పట్టణంలోని రాజంపేట చెక్‌పోస్టుకాలనీలో రోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. కాలనీలో మురుగుకాలువలను అస్తవ్యస్తంగా, సరైన ప్రణాళిక లేకుండా నిర్మించడంతో నీరు ముందుకు పారడం లేదు. రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, క్రిమికీటకాలతో కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరిస్తాం



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మారుతి

కెరమెరి: విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జోడేఘాట్ పర్యటనకు వచ్చిన ఆమెకు హట్టిలో కలిసిన టీవీఏసీ జాక్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం మారుతి వినతిపత్రం అందజేశారు. సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామని సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమంలో జాక్ నాయకులు మట్ల అశోక్ తదితరులు ఉన్నారు.

రైతు నేస్తం.. కనుమరుగు!



ఎడ్లబండిపై జాతరకు వెళ్తున్న గ్రామీణ ప్రజలు (ఫైల్)

- పెరిగిన ఆధునిక యంత్రాల వినియోగం
- ఊళ్లల్లో నిరుపయోగంగా మారిన ఎడ్లబండి

కౌటాల: రైతులతో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్న ఎడ్లబండ్లు నేడు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు ఎడ్లబండ్లు ఉండేవి అని పాఠ్య పుస్తకాల్లో ముందు తరాలకు చెప్పుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తుండడంతో వ్యవసాయ భూముల్లో స్థలం లేకుండా పంటలు సాగుచేస్తున్నారు. దీంతో పశువులు మేపడానికి స్థలం లేక రైతులు ఎద్దులను విక్రయిస్తున్నారు. దీంతో ఎడ్లబండ్లు మూలన పడుతున్నాయి. ఎడ్లబండ్ల వినియోగం, వాటి ఆవశ్యకతపై ప్రస్తుత యువ రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మరుగున ఎడ్లబండి..

ఒకప్పుడు ప్రతీ రైతు ఇంట్లో ఒక ఎడ్లబండి ఉండేది. ప్రతి పనికీ రైతన్నకు చేదోడు వాదోడుగా ఉన్న రైతు రథం నేడు కనుమరుగయ్యే దశకు చేరుకుంది. పూర్వకాలంలో ప్రజలు, రైతులు ఎక్కడకు వెళ్లాలన్నా ఎడ్ల బండ్లలోనే వెళ్లేవారు. చెక్కతో తయారు చేసి పైన ఇనుప కమ్మితో కవచంగా ఏర్పాటు చేసిన చక్రాలతో ఎడ్లబండ్లను ఉపయోగించేవారు. దశాబ్దం క్రితం వరకు ఈ ఎండ్లబండ్లు పల్లెల్లో ఎక్కువగా ఉండేవి.

ఆది నుంచి రైతు నేస్తం..

వ్యవసాయ పనులకు, కూలీలను తరలించాలన్నా, పండించిన ధాన్యాన్ని ఇంటికి తీసుకురావడానికి, వస్తువులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు, పెళ్లిళ్లకు, సంతకు, జాతరలకు, అడవి నుంచి వంట చెరకు, ఇతర సామగ్రి తీసుకురావడానికి వీటిని విరివిగా వినియోగించేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లు, ఆటోలు రావడంతో వీటి వినియోగం తగ్గింది. దీంతో ఎడ్ల బండి చక్రాలు తయారు చేసే వడ్రంగులు, కమ్మరులు పనులు లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. వడ్రంగులు, కమ్మరులు పనులు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



ఎడ్లబండిలో సీసీఐకి పత్తి తెచ్చిన రైతు(ఫైల్)

అవగాహన కరువు..

ఒకప్పుడు వెలుగు వెలిగిన ఎడ్లబండ్లు నేడు గ్రామీణ ప్రాంతాల్లో మూలనపడి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో ప్రస్తుతం కనుమరుగవుతున్న రైతుల రథమైన ఎడ్లబండ్లపై రైతులు ఇప్పటికైన ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం రైతులకు ఎడ్లబండ్లను పంపిణీ చేయాలని, గ్రామాల్లో రైతులు తప్పకుండా ఎడ్లబండ్లను వినియోగించాలని, యువ రైతులకు ఎడ్లబండ్ల ప్రాముఖ్యతపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని మండలంలోని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి

రైతు నేస్తం ఎడ్లబండి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కనుమరగవుతున్న మాట వాస్తవం. గ్రామాల్లోని చాలా మంది రైతుల వద్ద ఎడ్ల బండ్లు లేవు. గతంలో ప్రతీ రైతుకు పశువులు, ఎడ్ల బండి ఉండేది. మా చిన్నప్పుడు గ్రామాలకు వెళ్లాలన్నా ఎడ్ల బండే దిక్కు. కాని మారుతున్న కాలనుగుణంగా యువ రైతులు ఎడ్ల బండ్లను వినియోగించడం లేదు. సంబంధిత అధికారులు ఎడ్లబండ్ల వినియోగంపై యువ రైతులకు అవగాహన కల్పించాలి.

– మల్లయ్య, రైతు, గురుడుపేట

ఇంటింటా సంక్రాంతి సందడి

ఆసిఫాబాద్‌రూరల్: సంక్రాంతి పండుగతో ఇంటింటా సందడి నెలకొంది. సోమవారం భోగి పండుగ పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ప్రజలు నోములు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున రంగురంగుల ముగ్గులు కొనుగోలు చేశారు.

చిన్నారులకు భోగి పండ్లు

ఆసిఫాబాద్అర్బన్: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మొదటి రోజులో భాగంగా భోగి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు పోశారు. చిన్నారులకు మంగళహారతులు ఇస్తూ చకినాలు, రేగుపండ్లు, పోకలు, చిక్కుడు కాయలు, అక్షింతలు తలపై నుంచి పోశారు. ఇలా చేయడం వలన చిన్నారులు ఆయురారోగ్యాలతో పాటు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని మహిళలు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు

కౌటాల: మండల ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలను నిర్వహించారు. ప్రజలు భోగి మంట కాశారు. మహిళలు, యువతులు ఉదయం ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి పురస్కరించుకుని మండల కేంద్రంలో పిండిగిర్నిల వద్ద ప్రజలు క్యూ కట్టారు. సోమవారం వార సంతలో ప్రజలు పండుగ సరుకులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. ఇళ్లలో మహిళలు పిండి వంటలు చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు పూలలో భోగి పండ్లు పోశారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేశారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్సై కొమురయ్య

ఎల్కపల్లిలో ముగ్గుల పోటీలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకుడు రాచకొండ క్రిష్ణ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ఎస్సీ కాలనీలో నిర్వహించిన పోటీలకు మహిళలు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన ముగ్గురికి ఎస్సై కొమురయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాచకొండ రాజు, శంకర్ గౌడ్, చంద్రమౌళి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళలు



తలోడిలో ముగ్గు వేస్తున్న మహిళ



కౌటాలలో ముగ్గు వేస్తున్న యువతి

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండలంలోని తన స్వగ్రామం రాజురా గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. పుష్య పౌర్ణిమ సందర్భంగా గ్రామంలో గల జగదాంబదేవి సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సమీపంలోని సక్రియనాయక్ తండా గ్రామానికి చెందిన గ్రామ కారోబారి రాథోడ్ సుదర్శన్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



వాహనపత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్




డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై మధుకర్

రెబ్బెన: మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లక తప్పదని ఎస్సై డి. చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గోలేటి ఎక్స్ రోడ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనాలకు సంబంధిత ధ్రువపత్రాలతో పాటు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. అధికశాతం రోడ్డు ప్రమాదాలకు మద్యం సేవించి వాహనాలు నడపడమే కారణమన్నారు. అతి వేగంతో వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యేలా వాహనాల సైలెన్సర్‌లను మారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలపై చలాన్లు లేకుండా చూసుకోవాలన్నారు.


కౌటాలలో..

కౌటాల: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎస్. మధుకర్ అన్నారు. సోమవారం సాయంత్రం కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వాహనదారులు అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని తెలిపారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

ఘనంగా హరినామ మహా యజ్ఞోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలమడుగు: మండలంలోని పల్సిబి తండా గ్రామంలో సంత్ శ్రీ నారాయణ బాబా ఆలయ 29వ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం అఖండ హరినామ మహా యజ్ఞోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయన్ని, నారాయణ బాబా ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ కిషన్, మండల కన్వీనర్ వెంకటేశ్, అభిరామ్ రెడ్డి, కేదరేశ్వర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, అంగూరు, పోచన్న, రమాకాంత్, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, ప్రకాశ్ రెడ్డి, ప్రమోద్, చందు, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి..

మండలంలోని పల్సిబీ తండాలో అఖండ మహాయజ్ఞ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలన్నారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు వెంకట్ యాదవ్, మహేందర్, ప్రతాప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న పండితులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శ్రీభూగోదా వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించా రు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవా ల్లో భాగంగా రెండు రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. సోమవా రం హోమం, నవగ్రహ పూజలు చే పట్టారు. అర్చకులు కల్యాణాచార్యులు, రాంగోపాల్ పాల్గొన్నారు. 16న స్వామి వారి కల్యాణం, రథోత్సవం ఉంటుందని శివదత్తగిరి మహరాజ్ తెలిపారు.